

# నేటికథ రేపటి ముగింపు

'పరాగిత్

హాల్లో గడియారం ఎనిమిది గంటలు కొట్టింది. నా ఆలోచనలకుఅంతరాయం ఏర్పడింది.

అదే సమయంలో—

బేబి నిద్రలో "మమ్మీ!" అంటూ పలవరించింది.

బాబు ఎంతో దిగులుగా ముఖం పెట్టి, "డాడీ, మమ్మీ ఇంకా రాలేదే?" అని ప్రశ్నించాడు.

నా కళ్లలో అప్రయత్నంగా నీళ్లు తిరిగాయి. "వస్తుంది బాబూ! మమ్మీ ఫ్రెండుకు ఇంకా జ్వరం తగ్గలేదేమో, జ్వరం తగ్గాక వస్తుంది. మరి రాత్రిపూట పిల్లలు ఎక్కువసేపు మేలుకోకూడదని మమ్మీ చెప్పలే! ఇక నువ్వు నిద్ర పోవాలి.' పసివాడికి ఆ పరిస్థితిలో అంతకంటే చెప్పలేక చిన్నగా బుజ్జగించాను.

"సరే, నేను నిద్రపోతా డాడీ! తెల్లవారి లేచి మమ్మీకి 'గుడ్ మార్నింగ్' చెప్తాను. గుడ్ నైట్ డాడీ!" బాబు బుద్ధిగా పడుకున్నాడు.

"గుడ్ నైట్ మై సన్!" పిల్లాడి నుదుటిమీద గాఢంగా ముద్దు పెట్టుకుని అలాగే ఈజీ—ఛేర్‌లో వేనూ వెనక్కి వాలి కళ్లు మూసుకున్నాను. నా బుర్రలో మళ్లీ ఆలోచనలు స్థావరం యేర్పరచుకున్నాయి.

లక్ష్మి నాకు అన్ని విధాల అనుకూలవతియైన నా యింటి యిల్లాలు. ఆరేండ్ల మా సంసార జీవితంలో నేను ఆమె కారణంగా ఏ రోజూ కష్టంగా ఫీలవలేదు. నేనూ ఆమెకు వ్యక్తిగతమైన సంపూర్ణ స్వేచ్ఛ ఇచ్చాను.

సాధారణంగా తను పగలు ఏ పనిమీద ఎక్కడకు వెళ్లినా రాత్రి ఎనిమిదిలోగా ఇల్లు చేరుకునేది ఒకవేళ అంతకు మించి ఆలస్యం అయ్యేట్లయితే ఇంటికి ఫోనుచేసి మరీ ఫలానా టైముకు వస్తానని చెప్పేది.

కాని నిన్న సాయంకాలం నాలుగు గంటలకు ఇంటి నుంచి వెళ్లిన మనిషి ఈ వేళ వరకూ తిరిగి రాలేదు. కారణం ఏమైనది, తానెక్కడ వున్నదీ ఫోను కూడ చేసి చెప్పలేదు.

నగర్‌లో రోజు రోజుకూ స్త్రీల మీద అత్యాచారాలు పెరిగి పోతూన్నట్లు పేపర్లలో వార్తలు చెబుతూనే వున్నాయి.

నగర్ పోలీస్ ఇన్స్‌పెక్టర్— విజయ్ నా బాల్య మిత్రుడు.

అనుమానంతో ఉదయం విజయ్‌ని కలిసి విషయం చెప్పాను.

బాబు, బేబీలకు, 'మీ మమ్మీ వాళ్ల ఫ్రెండొకావిడకు జ్వరంగా వుంటే చూసి రావటానికని వెళ్లిం'దని చెప్పాను.

లక్ష్మికి ఏమయిందో ఇప్పటి వరకూ తెలియదు. విజయ్ మాత్రం రెండుసార్లు ఫోన్ చేసి నాకు ధైర్యం చెప్పాడు.

నా లక్ష్మి ఎక్కడ వున్నా ఆమె క్షేమంగా వుండాలని నా కోరిక

టేబుల్ మీది ఫోన్ గణగణ మ్రోగింది. దిగ్గున లేచి రిసీవర్ అందుకున్నాను. ఆదుర్దాగా "కృష్ణ స్పీకింగ్" అన్నాను.

"కృష్ణా! నేను విజయ్‌ని నువ్వు వెంటనే బయలుదేరి జనరల్ హాస్పిటల్‌కు రా! కాని గాబరా పడకు" అని చెప్పి విజయ్ ఫోన్ పెట్టేశాడు.

మరుక్షణం నుంచి నా గుండె వేగంగా కొట్టుకోవటం ప్రారంభించింది. మరి ఆలస్యం చేయకుండా క్రిందికి దిగి వచ్చి, "ధనమ్మా!" అంటూ హాల్లో పడుకున్న పని మనిషిని లేపి, "నేను అర్జంటుగా బయటికి వెళుతున్నాను. పైన పిల్లల గదిలోకి వెళ్లి పడుకో" అని చెప్పి, ఆ మరు నిముషం బుల్లెట్‌మీద హాస్పిటల్‌కేసి అమిత వేగంగా బయలు దేరాను.

లక్ష్మికేదో ప్రమాదం సంభవించిందని,

అందుకే విజయ్ నాకలా ఫోన్‌చేసి చెప్పాడన్న ఆలోచనతో దారంతా నాకు నిజంగా గుండె దడగానే వుంది.

అయిదు నిముషాల్లో హాస్పిటల్ చేరుకున్నాను. విజయ్ నాకు ఎదురు వచ్చాడు.

"విజయ్! లక్ష్మికేమయింది? నన్నెందుకు ఇక్కడికి రమ్మన్నావ్ ?" దగ్గర చేరీచేరగానే ధైర్యం కోల్పోయి అడిగాను.

విజయ్ వెంటనే జవాబు చెప్పలేదు. కాసేపు నా కళ్ళల్లోకి బాధగా చూశాడు. తర్వాత, "సారీ కృష్ణా! లక్ష్మి ఆత్మహత్య చేసుకుంది" అన్నాడు మెల్లగా.

"నో" నేను అరిచాను. "ఐ కాంట్ బిలీవ్. ఎక్కడ ? నా లక్ష్మిని చూడాలి" అన్నాను.

వేగిరం విజయ్ ముందుకు కదిలాడు. నేను అనుసరించాను. ఇద్దరం కలిసి ఆ గదిలో అడుగు పెట్టాం. అక్కడ నా లక్ష్మి...

"లక్ష్మి !"అంటూ ఏడుస్తూ మీద పడబోయాను.

"కృష్ణా!" అని వెంటనే విజయ్ నా భుజం పట్టుకు ఆపాడు.

"విజయ్!" నేను చిన్నపిల్లవాడిలా ఏడ్చాను.

కొన్ని క్షణాల తర్వాత, "కృష్ణా! ప్లీజ్, కంట్రోల్ యువర్ సెల్ఫ్, ముందీ ఉత్తరాన్ని చదువు"విజయ్ నన్నుఓదారుస్తూ నాకో మడచిన చిన్న కాగితాన్ని అందించాడు.

తేరుకున్నాను. కాగితం విప్పి చూశాను.

అది నా లక్ష్మి నాకు వ్రాసిన ఉత్తరం. అందులో—

"నన్ను మన్నించండి. చాల రోజుల నుంచి మీకీ విషయం చెప్పాలనుకుంటూ చెప్పలేకపోయాను. ఇప్పుడు నా కడుపులో పెరుగుతూన్నది మీ పాప కాదు. బలహీనతకు లోనై తప్పు చేశాను. అందుకే మీతో కలిసి వుండలేక శాశ్వతంగా వెళ్లిపోతున్నాను— లక్ష్మి" అని వుంది.

"విజయ్! ఇదంతా అబద్ధం. లక్ష్మి ఎంత ఉత్తమురాలో నాకు తెలుసు. ఇందులో ఏదో మోసం వుంది" అన్నాను దృఢంగా.

"అఫ్‌కోర్స్!" విజయ్ ఆలోచిస్తూ అన్నాడు. "ఇప్పుడు ఆ విషయమే నిరూపణ కావలసి వుంది. అందుకు ముఖ్యంగా నీ సహకారం కావాలి..." అన్నాడు.

సందేహాస్పదంగా విజయ్ ముఖంలోకి చూశాను.

* * *

గురువారం : 30 జూలై, 1981.

లక్ష్మి నాకు దూరమై అప్పుడే నలభై ఎనిమిది గంటలు దాటిందంటే అంతా నాకింకా కలలాగే వుంది.

ఉదయం బాబును, బేబీని విజయ్ మిసెస్ ప్రతిభ వచ్చి తమ ఇంటికి తీసుకెళ్ళింది.

పోస్టుమార్టంలో లక్ష్మి చనిపోవటానికి ముందు రేప్ చేయబడిందనే విషయం బయట పడింది. ఈ విషయం తలచుకుంటూంటేనే నాలోంచి ఎక్కడలేని ఆవేశం పొంగుకొస్తూంది.

నాకు అబద్ధపు ఉత్తరం వ్రాసిపెట్టటానికి కూడ లక్ష్మి మరెంతగా హింసింపబడి వుంటుందో ఊహించుకుంటూంటే నా ఒంట్లో నరాలన్నీ నిజంగా తెగిపోయినంత బాధ కలుగుతూంది.

లక్ష్మి స్వచ్ఛమైన మనసును, ఆమె ప్రత్యేక వ్యక్తిత్వాన్ని నేను మా పెళ్లిచూపుల నాడే చూశాను.

ఆ నాడు, మా పెళ్లి చూపుల తతంగం ముగిసి, ఆమెను చేసుకోటానికి నేను నా ఇష్టం తెలుపగానే, అకస్మాత్తుగా అందరి పెద్దల ముందు బిడియం లేకుండా తను నాతో ఏకాంతంగా మాట్లాడాలని కోరింది. మా పెద్దలు నిర్ఘాంత పోయారు. ఆమె పెద్దలు అందుకు అంగీకరించలేదు. కాని నేనే ఇరుప్రక్కలా సర్ది చెప్పాను.

మా ఇద్దరికీ ఏకాంతం లభించగానే, "కృష్ణగారూ! మా వాళ్ళు మిమ్మల్ని మోసం చేయాలని చూస్తున్నారు. కాని అది నాకు ఇష్టంలేదు. నాకిదివరకే 'ప్రకాశ్' అనే అతనితో పరిచయం ఉంది. ఇద్దరం ప్రేమించుకున్నాం. కాని అనుకోకుండా మా పెళ్లికి ఒక అవాంతరం యేర్పడింది. ప్రకాశ్ చెల్లెలు ఒక దుర్మార్గుడి వల్ల మోసపోయి చనిపోయింది. దాంతో ప్రకాశ్ మనసు వికలమైంది. ఇక తనకు పెళ్లి మీద ఆశ లేదంటూ ఆ దుర్మార్గుడిని వెతికి పట్టుకుని చంపటమే తన ధ్యేయమని చెప్పి తనను మరచి పొమ్మన్నాడు. నేను ఏడ్చాను. అయినా అతను చలించక ఎటో వెళ్లిపోయాడు. నేను చేసేది లేక చివరకు నన్ను కన్నవాళ్ల సంతోషం కోసం ఈ పెళ్లి చూపులకు ఇష్టపడ్డాను. ఇదీ విషయం. ఇప్పుడు కూడా నన్ను మీరు చేసుకోటానికి ఇష్టపడితే నాకు అభ్యంతరం లేదు. కాని నేను పూర్తిగా మీ స్వంతం కావటానికి నాకు కొంత టైం అవసరం కావచ్చు. ఏమంటారు" అని అడిగింది సూటిగా.

"ఇప్పుడు మీరు నా కింకా బాగా నచ్చారు లక్ష్మిగారూ!" అన్నాను నేను సంతృప్తిగా.

ఆ నాటి సంఘటనను నే నెప్పటికీ మరచిపోలేను.

మధ్యాహ్నం విజయ్ సలహా మీద లక్ష్మి పర్సనల్ వస్తువులు అన్నింటినీ తనిఖీ చేశాను.

ఒక సూట్‌కేసులో రెండు 'రసమయి' పత్రికలు, చిన్న ఉత్తరాల కట్ట కనిపించాయి. వాటిని పైకి తీసి చూశాను.

ఉత్తరాలన్నీ 'ప్రియతమరావు' అనే రచయిత నుంచి లక్ష్మికి వచ్చినవి. పత్రికల్లో ఒకదానిలో ఆ ప్రియతమరావు ఫోటో ప్లస్ పరిచయం, రెండవదానిలో అతని అడ్రసు ప్రచురింపబడి వున్నాయి.

లక్ష్మికి కథలన్నా, కథలు వ్రాసేవారన్నా ఒక పిచ్చి.

ఉత్తరాలు ఒక్కొక్కటీ తీసి నేనూ విజయ్ చదివాం.

ఆ ఉత్తరాలు చదవటం వల్ల జరిగిందేమిటో నాకు కొంతవరకు బోధపడింది. ప్రియతమరావు ఎంత నీచుడో బాగా అర్థమైంది. కాని అతను లక్ష్మిని మాత్రం చాల తెలివిగా మోసం చేశాడు. లక్ష్మి తనకున్న పిచ్చితో ఈ విషయాన్ని గ్రహించలేకపోయింది.

ఉత్తరాల్లో ఒక రచయితగా మొదలైన అతని వ్యవహారం క్రమంగా లక్ష్మి వ్యక్తిగత విషయాల మీదికి మళ్లింది.

తొలి ఉత్తరంలో "శ్రీమతి లక్ష్మి కృష్ణగారికి" అని ప్రారంభించి 'ఇట్లు— ప్రియతమ రావు' అంటూ ముగించిన మనిషి చివరి ఉత్తరం వ్రాసేనాటికి 'డియర్ లక్ష్మీ' నుంచి 'యువర్స్ ప్రియతమ్' వరకు వచ్చాడు.

తనను అంతగా అభిమానించే ఆమెను ఒకసారి చూడాలని వుందని వ్రాసి, అభ్యంతరం లేకపోతే లక్ష్మిని ఒక ఫోటో పంపమన్నాడు. లక్ష్మి ఫోటో చేరిన పిమ్మట అపార్థం చేసుకోవద్దని వ్రాస్తూనే మీ భర్త నిజంగా

అదృష్టవంతుడని— మీరు చాల అందంగా ఉన్నారన్న అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు. తరువాత లక్ష్మికి ఇద్దరు పిల్లలున్నారని తెలిసి అది తను నమ్మలేక పోతున్నానంటూ, ఆమెతో తన పరిచయం ముందే జరుగనందుకు మరెంతో బాధ పడుతున్నట్లు వ్రాశాడు.

ఆమె నుంచి ఉత్తరం వచ్చిన రోజు కథల పోటీలో తన కథకు మొదటి బహుమతి వచ్చినంత ఆనందంగా వుంటుందని, రాని రోజు తనకు పిచ్చెక్కిపోతుందంటే నమ్మమని వ్రాశాడు.

తెలిసినవారి పెళ్లికోసం వచ్చి తిరుపతిలో అనుకోకుండా ఇద్దరం కలిసిన ఘడియను తను క్షణ క్షణం జ్ఞాపకం చేసుకుంటున్నానని వ్రాశాడు.

చివరి ఉత్తరంలో ఈ నెల ఇరవై ఎనిమిదవ తారీఖున తను ఒక పనిమీద నగర్ మీదుగా వెళ్లవలసి వుందని, పనిలో పనిగా లక్ష్మిని కలవటానికి వీలుగా ఆ తారీఖున నగర్ టూరిస్టు లాడ్జిలో రూము రిజర్వు చేశానని, కనుక తప్పకుండా ఆ రోజు సాయంకాలం ఆరుగంటలలోగా ఆమె ముప్పై ఆరో నెంబరు రూములో తనను కలుసుకోవలసిందిగా వ్రాశాడు.

చివరి ఉత్తరం ఆధారంగా విజయ్ వెంటనే ఎంక్వైరీ ప్రారంభించాడు.

ఆ ఉత్తరంలో వ్రాసిన విధంగానే టూరిస్టులో ఇరవై ఎనిమిదన ముప్పై ఆరో నెంబరు రూము ప్రియతమరావు పేరిట



రిజిస్టరయి వుంది. పైగా ఆ రూము వారం క్రితమే స్థానిక 'త్రివేణి' పత్రికాసంపాదకుడు రావూజీ అతని కోసం రిజర్వు చేయించాడని కూడ తెలిసింది.

ఇంకా, ఇరవై ఎనిమిది మధ్యాహ్నం రెండు గంటలకు ప్రియతమరావు తనరూములోదిగాడని తర్వాతఆమె(లక్ష్మి ఫొటో చూపగా గుర్తించి) అదేరోజు సాయంకాలం అయిదు గంటల ప్రాంతంలో అతనికోసం అక్కడికి వచ్చిందని లాడ్జి మేనేజరు చెప్పాడు. రూం — బాయ్ 'వీరన్న' ఆమెను తనే ప్రియతమరావు గదిలోకి తీసుకు వెళ్లానని, తర్వాత ఆరు గంటలకి వారికి కాఫీలు—తొమ్మిదిగంటలకు భోజనాలతో పాటు ప్రియతమరావు డబ్బిస్తే మందుకూడ సప్లై చేశానని చెప్పాడు.

ఆ తర్వాత పన్నెండు గంటల వేళలో రావూజీ అక్కడికి కారులో వచ్చాడనీ, హడావుడిగా స్పృహలో లేని లక్ష్మిని కారెక్కిస్తూండగా చూసి కారణం అడిగితే ఆమె ఎక్కువగా త్రాగినట్లు—ఇంటిదగ్గర దిగబెట్టడానికి తీసుకెళుతూన్నట్లు చెప్పాడని కూడ పై ఇద్దరూ తెలిపారు.

మరువాడు (నిన్న) తెల్లవారు జామున అయిదున్నరకంతా ప్రియతమరావు రూము ఖాళీచేసి వెళ్లిపోయాడన్నారు.

ఈ సాక్ష్యాధారాలతో నిమిషాలమీద విజయ్ రావూజీ ఇంటికి వెళ్లి అతన్ని అరెస్టు చేశాడు. అయితే మామూలుగానే రావూజీ 'నేరం' ఒప్పుకోలేదు. అసలు ఆ టైములో తాను లాడ్జికే వెళ్లలేదన్నాడు కూడ.

పోతే ప్రియతమరావుకు సంబంధించి కూడ అవసరమైన సమాచారం సిటీ పోలీసు అధికార్లకు అప్పటికప్పుడే తెలుపబడింది.

సిటీ ఇన్‌స్పెక్టర్ — శ్రీ దాస్ దగ్గర క్రొత్తలో విజయ్ కొంతకాలం పని చేశాడట. స్పెషల్ ఇంటరెస్టు తీసుకుని రేపు ఉదయమే సిటీకి వెళ్లేందుకు విజయ్ తన అధికార్ల నుంచి కావలసిన ఆర్డర్సు కూడ ఈ రాత్రే తీసుకున్నాడు.

రేపు నేనూ విజయ్‌తో వెళ్లాలి.

డైరీ పూర్తిచేసేసరికి చేతి గడియారం మూడు గంటలు చూపుతూంది.

* * *

శ్రీ దాస్ విజయ్ అందించిన ఫైలును సీరియస్‌గా స్టడీ చేస్తున్నాడు. అంతలో ప్రక్కనున్న ఫోను మ్రోగింది. ఫైలు నుంచి దృష్టి మరల్చకుండానే ఫోను అందుకుని "ఇన్‌స్పెక్టర్—శ్రీ దాస్ హియర్" అన్నాడు అంతే! అవతల నుంచి జవాబు యేంవచ్చిందో వెంటనే "వ్వాట్ !" అని కుర్చీలోనే ఉలిక్కిపడి చూస్తూన్న మా ఫైలును ప్రక్కకు నెట్టేసి, "అలాగా !" అంటూ రిసీవర్ మరింత గట్టిగా పట్టుకుంటూ మాకేసి విచిత్రంగా చూశాడు.


మేమూ విషయమేమిటో అర్థం గాక ఆయనకేసి అలాగే చూశాం.

మరో అయిదు క్షణాల తర్వాత "అలాగే ఇప్పుడే బయలుదేరుతున్నాం" అని ఫోను పెట్టేసి వెంటనే, "ఒన్ థర్టీ సిక్స్! ఒన్ సిక్స్‌టీ ఫోర్ !" అని కేకేసి మాతో "మిస్టర్ విజయ్ ! వన్ స్ట్రైకింగ్ న్యూస్ ఫర్ యూ. రాత్రి ప్రియతమరావు ఆత్మహత్య చేసుకున్నాడట" అన్నాడు.

మేము నిజంగానే షాక్ తిన్నాం. అదే సమయంలో ఇద్దరు కానిస్టేబుల్లు లోనికి వచ్చారు. వాళ్లను చూస్తూనే "వెంటనే జీపు రెడీ చేయండి" అంటూ కుర్చీలోంచి లేచాడు. మేమూ లేచాం.

మరి పది క్షణాల్లో శ్రీ దాస్ రెడీయైపోయి, "కమాన్ విజయ్ ! కృష్ణగారూ ! మీరు కూడ" అంటూ ముందుకు కదిలాడు. ఆయన్ని అనుసరించాం.

అంతా జీపులో కూర్చున్నాం. వెంటనే జీపు బయలుదేరింది.



ఆ క్షణంలో నా మనసు ఎందుకో హంతుని చూడాలని జీపు కంటే వేగంగా ఆతురత పడుతూంది.

పదినిమిషాల తర్వాత జీపు ఓ పెద్ద బిల్డింగు ముందు ఆగింది. అక్కడ అప్పటికే జనం తండోపతండాలుగా వున్నారు.

ముందుగా కానిస్టేబుల్లు జీపు దిగి జనాన్ని దూరంగా నెట్టారు.

మొదట శ్రీ దాస్జె, తర్వాత విజయ్‌తో నేనూ క్రిందికి దిగి లోపలికి నడిచాం.

ప్రియతమరావు మృతదేహాన్ని చూసిన నా ఒళ్లు జలదరించింది.

మృతదేహం రక్తపు మడుగులో అర్ధ నగ్నంగా పడివుంది. దేహం నుంచి కుడిచేయి వేరు చేయబడి వుంది. రొమ్ము ఎడమ భాగంలో పిడివరకు దిగబడిపోయిన కత్తి కన్పిస్తూంది. పైన రెండు కళ్లు పొడవబడి వున్నాయి. క్రింద పట్టిగ్గా కన్పిస్తూన్న మర్మావయవం చితికిపోయినట్లుంది.

ఎవరో పెద్ద మనిషి శ్రీ దాస్జెదగ్గరకు వచ్చి ఒక కాగితం అందించాడు. శ్రీ దాస్జె దాన్ని చదివి ప్రక్కనున్న విజయ్‌కు ఇచ్చాడు.

ఆత్రుతగా నేనూ ఆ కాగితంలోకి చూశాను.

ప్రియతమరావు తాను ఆత్మహత్య చేసుకోబోతూ, ఆ ఆత్మహత్య ఎందుకు ఎలా చేసుకుంటున్నదీ వివరంగా వ్రాసి పెట్టిన ఉత్తరం. అందులో సారాంశం...

'ఇది నేను ఇంత వరకు చేసిన ఎన్నో పాపాలకు పశ్చాత్తాప పడి చేసుకుంటున్న ఆత్మహత్య. ముందుగా నాచేత పాఠకుల్ని తప్పు దారి పట్టించే రచనలు చేయించిన ఈ కుడి చేయిది క్షమించరాని నేరం. అందుకే దీన్ని నరికేస్తున్నాను. తరువాత అభిమానంతో దగ్గరకు వచ్చిన అమాయక పాఠకురాండ్రమీద అనేక ఘాతుకాలు జరిపాను. అందుకు కారణమై కామంతో మూసుకుపోయిన నా రెండు కళ్లను, పొగరెక్కి ప్రవర్తించిన వయసు మదాన్ని నిజంగా చితకపొడవాలి. స్వయంగా ఈ పనే చేస్తూ, నా లాంటి నీచుడు ఇక ఈ భూమ్మీద ఒక్క క్షణం కూడ బ్రతికుండ కూడదని, పదునైన కత్తిని నా గుండె అడుగు దాకా దింపుకుని నన్ను నేనే శిక్షించుకుంటున్నను.'

నాకు వెంటనే బిగ్గరగా నవ్వాలనిపించింది.

కాని నవ్వలేదు.

శ్రీ దాస్జె విజయ్‌ని మాత్రం తనతో రెండు రోజులు ఉండమన్నాడు! నేను ఇద్దరి వద్ద సెలవు తీసుకుని సిటీ నుంచి నగర్‌కు బయలుదేరాను.

నగర్ చేరుకునే సరికి రాత్రి సుమారు పదకొండు గంటలైంది. స్టేషన్ నుంచి ఇంటికి వెళ్లకుండా శ్మశానానికేసి నడక సాగించాను.

పున్నమి వెన్నెల చుట్టూ విరియ కాస్తూంది. తేలిక పడిన మనసు వల్ల హుషారుగా అడుగులు పడుతున్నాయి.

శ్మశానం వచ్చింది.


ఆశ్చర్యం! ఆ వేళలో లక్ష్మిని పాతిపెట్టిన స్థలంలో ఎవరో ఒకతను నిల్చుని వున్నాడు.

అనుమానంగా ఓ ప్రక్కగా దాక్కుని అతని చేష్టల్ని గమనించాను.

అతను తన రెండు పిడికిళ్లు బిగించి పట్టి సమాధిలో వున్న లక్ష్మికి చెబుతూన్నట్లుగా ఏదో అంటున్నాడు. మాటలు వినిపించటం లేదు.

మధ్య మధ్య బిగ్గరగా నవ్వుతూన్నాడు.



# ధర్మపథం

బులుసు వేంకటరమణయ్య

## యజ్ఞాల తత్త్వం

మన వేద పురాణాలలో అనేక గూఢార్థాలు ఇమిడి వున్నవి. కేవలం లౌకికార్థాలనే తీసుకొని కొందరు విపరీతాభిప్రాయాలను వెల్లడిచేస్తూ వాని విలువను తగ్గిస్తున్నారు. వేదాలకు ఆధిభౌతిక, ఆధిదైవిక, ఆధ్యాత్మికార్థాలు మూడు ఉన్నవని యాస్కాచార్యులవారెన్నడోచెప్పారు. కర్మనిరతులు కర్మపరమైన అర్థాలు చెప్పారు. తత్త్వవేత్తలు ఆధ్యాత్మ పరంగా అర్థం చెప్పారు. పరిశీలన దృష్టితో చూస్తేనే గాని తత్త్వం గ్రహించడం సాధ్యం కాదు.

ఏ మతమైనా సరే, హింసనుబోధించదు. భారతీయులకు అహింసయే ప్రధానం. భారతంలో అజగర ప్రశ్నకు ధర్మరాజు చెప్పిన సమాధానం దీనికి తార్కాణం.

అతి ప్రాచీన కాలం నుంచీ వైదిక సంప్రదాయాన్నిబట్టి యజ్ఞాలు చెయ్యడం ఉన్నది. ఆ యజ్ఞాలే అధ్వరాలనీ, క్రతువులనీ, యాగాలనీ కూడా చెప్పబడుతూ ఉన్నవి యజ్ఞం అంటే—అందులో తప్పకుండా పశువిశసనం (మేక మున్నగువాని వధ) వుంటుందనే అభిప్రాయం అనాది మంచీ వస్తూ వున్నది. వాస్తవానికి పశువధను వేదం విధించలేదు. యాగాలు భూతతృప్తికి ఏర్పడినవే! అధ్వరం యజ్ఞం గదా! అధ్వరశబ్దానికి హింసా రహితమైనదనే అర్థం. సత్రయాగాలు మున్నగునవి దేశక్షేమానికి, లోక శాంతికీ ఆచరింపబడేవి. యజ్ఞంలో పశుహింస వ్యాప్తికి వచ్చిన తర్వాతనే బౌద్ధమతం తలయెత్తిందని చాలా మంది అభిప్రాయం.

యజ్ఞంలో ముఖ్యమైనది దీక్ష. పశు విశసనం కాదు. తదేకదీక్షతో భగవద్గీతా పారాయణ, ఉపన్యాసాలు జరిగితే గీతాయజ్ఞం అని చెప్పబడుతున్నది. త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజియ్యర్‌స్వామి వారు శ్రీరామ క్రతువులను ఎన్నింటినో ఆచరించారు. గాంధీ మహాత్ముడు మరణించిన సర్వోదయ దినమున తేదేక దీక్షతో నిర్విరామంగా నూలు వడకడం సూత్ర యజ్ఞంగా ప్రఖ్యాతి పొందినది. పై వానిలో వేటికీ పశు హింసతో సంబంధం లేదు గదా! అలాగే మొదట్లో యజ్ఞాలు ఈ విధంగానే జరుగుతూ ఉండి వుండాలి. క్రమంగా యాగాలలో పశు హింస చోటు చేసికొని వుండొచ్చును. కాగా, దేశ క్షేమానికై హింసారహితంగా దీక్షతో జరిపేదే యజ్ఞమని మనం ఊహించడానికి ఎంతో అవకాశం ఉన్నది.

---

## నేటికథ—రేపటిముగింపు

కాని అతను పిచ్చివాడు కాదు. గడ్డం, జుట్టు పెరిగి లేవు. డ్రస్సులో సహా మనిషి మొత్తం ఎంతో నీటుగా వున్నాడు.

వయసులో నా కంటే చిన్నవాడే కావచ్చు.

అంతలోనే అతను చేతులు కట్టుకు కొన్ని క్షణాలపాటు మౌనంగా నిలబడ్డాడు. పిమ్మట రెండు కళ్లను ఒక వ్రేలితో తుడుచుకుని అక్కడ్నుంచి కదిలాడు.

దాంతో విషయం నాకు పూర్తిగా అవగాహన అయింది. నా మనసు ఆనందంతో ఉప్పొంగింది. నా రెండు కళ్లనిండా కూడా కన్నీళ్లు.

అతను నన్ను దాటి వెళ్లిపోతున్నాడు. చటుక్కున వెలుపలకు వచ్చి "ప్రకాశ్!" అంటూ ఆప్యాయంగా పిలిచాను.

ప్రకాశ్ ఆగి వెనుదిరిగాడు. నన్ను చూసి "కృష్ణగారూ! మీరా!" అన్నాడు ఆశ్చర్యంగా.

ప్రకాశ్ నన్ను పోల్చుకున్నందుకు నేను ఆశ్చర్యపోలేదు. అతని మొహమైనా అంత వరకు చూడని నేనే అతన్ని సులభంగా గుర్తించినప్పుడు, లక్ష్మికి ఆరేళ్ల క్రితం దూరమైనా ఆమెను మరువక ఎప్పటికప్పుడు ఆమె బాగోగులు తెలుసుకుంటూ ఆమె చావుకు కారణమైన వాడినే పోలీసులు వెళ్లటానికి ముందే వెళ్లి అంతం చేసిన మనిషి, ఆమె భర్తగా నన్ను మాత్రం తెలియకుండా వుంటాడా?

"ప్రకాశ్! నేను చేయలేని పనిని నువ్వు చేశావు. లక్ష్మికి జరిగిన అన్యాయానికి తగిన న్యాయం చేశావు. ఇక నువ్వెక్కడికీ వెళ్ల వలసిన పని లేదు. నా తమ్ముడిగా నాతోనే వుండిపో. లక్ష్మి తన గుర్తులుగా మిగిల్చి పోయిన ఇద్దరు పిల్లలతో మన జీవితాలు గడిపేద్దాం. ఏం?" అడిగాను మనస్ఫూర్తిగా.

"కృష్ణగారూ! ఈ జీవితం ఇప్పుడు నాది కాదు. ఆదేనాడో ఒక ఆశయ సిద్ధికి అంకితమైంది" అని ఓ క్షణం ఆగి మళ్లీ "ఒకప్పుడు మనుషుల మధ్య తప్పు చేసిన వాన్ని కూడ మన్నించే మహనీయ న్యాయం ఉండేది. దానివల్ల నేరస్థుల్లో పరివర్తన కలిగి చివరకు మంచే జరిగేది. కాని ఇప్పుడు అబలల్ని— పసిపిల్లల్నీ, అమాయకుల్ని— బలహీనుల్ని హింసించి చంపే దానవ న్యాయం విచ్చలవిడిగా రాజ్యం చేస్తోంది. అందుకే ఈ దానవ న్యాయాన్ని గద్దె దింపి, 'నేరం చేసిన వాడ్ని శిక్షించి తీరాలి; దెబ్బకు దెబ్బ — ప్రాణానికి ప్రాణం, ఇదే న్యాయం' అని చాటి చెప్పే మానవ న్యాయ స్థాపన కోసం కృషి చేస్తున్నాను. నా చెల్లెల్ని వంచించిన దుర్మార్గుడి చావుతో ఇది ఆరంభమై లక్ష్మిని చెరిచిన కాముకుడి వధతో కొంత రూపానికి వచ్చింది. కాని పూర్తి రూపానికి వచ్చి ఆపైన ప్రాణ ప్రతిష్ఠ జరగడానికి ఇంకా ఎంత కాలం పడుతుందో తెలియదు. అంత వరకు నా ప్రయాణం ఆగదు" అంటూ గంభీరంగా సమాధానం ఇచ్చి మరి అక్కడ నిలబడకుండా వడివడిగా ముందుకు సాగిపోయాడు, ప్రకాశ్.

నేను అతన్నే చూస్తూ చాలా సేపు కదలకుండా నిల్చుండిపోయాను.

నేనున్నది 'నేడు.' ప్రకాశ్ పయనిస్తున్నది 'రేపు'. 'నేడు'కు ముగింపు 'రేపు'. సో, నేటి 'కథ'కు కావలసింది రేపటి 'ముగింపు'. విష్ హిమ్ సక్సెస్!